తనని
ఎంతో అందంగా
చిత్రించిన
అతనిపై
ఆమెకు కోపమా?
ప్రేమా?

గోళ్ళ సోమరాజు
కథ

# ప్రేరణ

రివాల్వింగ్ చైర్‌లో రిలాక్సింగ్‌గా కూర్చుని అటూ—ఇటూ తిరుగుతూ పత్రిక మొదటి ప్రతిని (ఎడిటర్ కాపీ) చేతబట్టి ప్రతి పేజీ సంతృప్తికరంగా వచ్చిందీ లేనిదీ పరిశీలిస్తున్న అతను అద్దాల తలుపులు విసురుగా తెరుచుకున్న అలికిడికి అటువైపు తిరిగిచూశాడు.

రేగినజుట్టు, ఎరుపెక్కిన కళ్ళతో ఆడపులిలా ఉందామె అవతారం. ఎప్పుడూ సౌమ్యంగా— శాంతికపోతంలా కనిపించే ఆమె అందుకు విరుద్ధంగా దర్శనమివ్వడం ఆశ్చర్యంగా ఉంది.

ఆమె పేరు 'శ్వేత'. పేరుకు తగ్గట్టుగా తెల్లని ఫుల్‌వాయిల్ చీరలో విరిసిన తెల్లగులాబీలాగుంది. ఉబికి వస్తున్న కోపాన్ని అదుపు చేసుకోలేక అదురుతున్న పెదాలతో అడిగింది.

"నన్నెందుకు అవమాన పరిచారు?..."

అతను నొసలు చిట్లించి చూశాడు. ఏమీ అర్థంకానివాడిలా!

ఆవేశాన్ని అణుచుకోలేక గద్గద స్వరంతో ఇంకా ఇలా అంది. "నేను మీకేం చేశానని నన్నిలా కించపరిచా రు? మీ మనసులో ఏముండి అతనిద్వారా నా మనసు నొప్పించాలని చూశారు?..."

అతను మధ్యలో కలగజేసుకున్నాడు. "దేనిగురించి మీరంటున్నది?..."

మూచాయిగా అతనికో విషయం తెలుసు. అదేనా కాదా అన్న సంశయంతో ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు.

"అంటే.. ఇంత జరిగినా.. మీకు తెలియరాలేదా? మీ అనుమతిలేకుండానే



అతనెంత పనిచేయగలడా?.. "ఉద్రేకంపాలు మరింత ఎక్కువైందామెలో.

"అసలు విషయం ఏమిటో చెప్పకుండా ఇలా ప్రశ్నల వర్షం కురిపిస్తే నేనేం సమాధానం చెప్పగలను చెప్పండి?..."

కాలింగ్ బెల్ నొక్కుతూ తిరిగి ఇలా అన్నాడు. "మీలో ఇంత ఆవేశం ఎప్పుడూ చూడలేదు. ఎగ్జైటవక కాసేపలా

కూర్చోండి. నిమ్మళంగా అసలు విషయమేమిటో చెబుదురుగానీ..."

బాయ్ వచ్చి నిలబడటంతో అతనివైపు తిరిగి "మంచి టీ ప్రటా!..." టాపిక్ డైవర్ట్ చేస్తే కాస్త ప్రశాంతత నెలకొంటుందని అతని ఆలోచన కావచ్చు.

ఆమె కూర్చునే ప్రయత్నం చేయక అలా నిలబడే అంది. "నేను మర్యాదల కోసం రాలేదిక్కడికి.. అసలు సంగతేమిటో తేల్చుకుందామని వచ్చాను. ఆవేశంలో ఆమె మాటలు కూడా తడబడుతున్నాయి. 'తెలుసుకుందా'మన్న పదాన్ని 'తేల్చుకుందామని' పొరపాటుగా పలికింది.

"ప్లీజ్!.. వయసులో మీ కన్నా **పెద్దవాళ్లే... అందుకైనా మీరు నా మాట** మన్నించవచ్చు!" గంభీరవదనంతో అతనన్న మాటలకు ఆమె రవంత చలించి ఉండాలి నిశ్శబ్దంగా కుర్చీలో కూర్చుండిపోయింది.

అతను ఆమె నుండి చూపులు మరల్చుకుని తన పనిలో లీనమయ్యాడు. కాస్సేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

అతని జీవితంలో ఎదురైన అనుభవాలతో పోల్చితే ఇదేమంత పెద్ద విషయం కాదు. ఇంతకన్నా జటిల సమస్యలెన్నో ఇట్టే పరిష్కరించాడు కాబట్టే ఈనాడీ స్థితికి రాగలిగాడు.

బాయ్ టీ కప్పులు ఇద్దరికీ అభిముఖంగా ఉంచి వెళ్ళిపోయాడు.

అతను యాంత్రికంగా టీ కప్పు చేతికందుకుంటూ అన్నాడు "టీ తీసుకోండి.. .చల్లారితే బావుండదు..."

అతనివైపు చురుగ్గా చూసింది ఏమిటీ విచిత్ర మనిషన్నట్లు. నిజంగా తానిప్పుడు రుచులు ఆస్వాదించడానికొచ్చిందా? ఎదుటి మనిషి ఆవేదనను అర్థం చేసుకోలేని మనిషి అసలు మనిషేనా అన్న అనుమానంతో అతనివైపు చూసింది. ఆవేశం తిరిగి అంచులు దాటడంతో పెదవివిప్పి ఏదో పలుకబోయింది. ఇది గ్రహించిన అతను **మధ్యలోనే అడ్డుకుని "ముందు మీరా టీ** తాగితేనే.. మీ మాట వినేది!.. చిరునవ్వుతోనే అతను హెచ్చరించడంతో ఎదురుచెప్పలేని అసక్తతకు లోనై మౌనంగా టీకప్పు అందుకుంది.

లిప్తపాటు ఆమె వైపుచూసి తృప్తిగా నవ్వుకున్నాడు తన పెద్దరికం నిలబెట్టినందుకు.

ప్రముఖ వారపత్రికకు అతను సంపాదకుడని వేరే చెప్పనవసరం లేదనుకుంటా!?

ఇక ఆమె గురించి చెప్పాలంటే... గడపదాటని సాంప్రదాయ కుటుంబంలో పుట్టినా గత్యంతరంలేక బ్రతుకు తెరువుకోసం ఈ సంస్థలో 'ప్రూఫ్‌రీడర్'గా చేరింది. గత్యంతరానికి కారణం ఆమె అతిచిన్న వయస్సులోనే వైధవ్యాన్ని పొందడం.

ఏదో మొక్కుబడికన్నట్లు రెండు గుక్కలు తాగి కప్పు టేబుల్‌మీదుంచింది. కోపం చల్లారని మూలాన మౌనంగా ఎటోచూస్తూ కూర్చుంది. అతనెంతకూ మాట్లాడకపోయేటప్పటికి కాస్త చిరాకు కలిగిందేమో చివ్వున తలెత్తి అతని వైపు

చూసింది. ఇహ ఉండలేక లేచి నిలబడింది.

ఆశ్చర్యం అతని కళ్ళలో ప్రస్ఫుటమవుతుండగా అడిగాడు. "అరే! అప్పుడే లేచినిలబడ్డారే? అసలు విషయం చెప్పకుండానే వెళ్ళిపోతారా?.."

"వినే ఉద్దేశం మీకు లేదని!" నిర్మొహమాటంగా అంది.

"మీకెలా తెలుసు?... అయినా మీకు నిలబడితేనేకాని మాటలు రావనుకుంటా?..." ఎగతాళిగా అతను నవ్వడం ఆమె ఉద్రేకాన్నింకా రెచ్చగొట్టినట్లయింది. ఉడుకుమోత్తనంగా తిరిగి కుర్చీలో కూర్చుండి పోయింది. వస్తూన్న దుఃఖాన్ని పంటి బిగువున అదిమిపట్టింది.

"మీ చేతిలో ఉన్న వారపత్రిక ముఖచిత్రం మీకు తెలీకుండానే ప్రింటయిందా?..." అసలు విషయం బయట పెట్టి సమాధానం కోసం అతనివైపు గుచ్చిచూసింది.

"నేను ఓకే చేసిన తరువాతే ప్రింటింగ్‌కు వెళ్ళింది! అయితే?" అర్థం కానట్లు చూశాడు.

"నా అనుమతి లేకుండా నా బొమ్మవేసే అధికారం అతని కెవరిచ్చారు?"

"మిమ్మల్ని ఉద్దేశించి వేసిందేనని మీరెందుకనుకుంటున్నారు?..."

"అతనిమీద మీకభిమానముంటే ఉండచ్చుగాక అంతమాత్రంచేత..." ఆమె గొంతు బొంగురుపోయి వాక్యం పూర్తిచేయలేకపోయింది. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

"మీరు నన్ను పొరపాటుగా అర్థం చేసుకుంటున్నారు... నాకు ఎవరిమీద పక్షపాతబుద్ధి లేదు. తప్పుచేస్తే నాకు ఎవరైనా ఒకటే!... అంటూనే పత్రిక అట్టమీది బొమ్మవైపు — ఆమెవైపు మార్చిమార్చి పరీక్షగా చూశాడు.

బొమ్మలో ఆమె పోలికలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. కాదంటే సహజంగా పాలిపోయినట్లు కనిపిస్తున్న ఆమె పెదాలకు ఎరుపురంగు పూయడంతో మధురిమ లొలికే అధరాలను గుర్తుచేస్తున్నాయి. కాటుక పులమని కలువ కళ్ళను నలుపురంగుతో తీర్చిదిద్దడం, బోసిపోయిన చెవితమ్మెలకు, ఎర్రని చిన్నని గరికెపూలు అలంకరించడం, కళావిహీనమైన లలాటంపై కుంకుమపువ్వు చిత్రించడంతో



### కిరసనాయిలు

"అక్కా కిరసనాయిలు చాలా విలువయిందా?" పరిగెత్తుకుంటూ వచ్చి అడిగాడు నాని.

"ఏం ఎందుకని" అడిగింది అక్క.

"ఏం లేదు. అమ్మ పచ్చడి రుబ్బుతుంటే అందులో రెండు చుక్కలు కిరసనాయిలు వేసాను.

అంతే వీపు పగిలేట్టు కొట్టింది" అన్నాడు నాని.

—కదలి వెంకటేశ్వరరావు (అమలాపురం)

ఇంకుదిగిన మో హనిలా భ్రాంతిని కలుగజేస్తుంది. కాదంటే చిత్రకారుడి కుంచెవేసిన పొరపాటొక్కటే అతన్ని దొంగగా పట్టుబడేలా చేసింది. ఆమె కుడిబుగ్గపై కందిగింజంతున్న పుట్టుమచ్చ యథాతథంగా బొమ్మలో దర్శనమివ్వడం!

ఆ విషయమే తన ఫిర్యాదు పత్రంలో పేర్కొంది. 'గరికపూవు' అని ముఖచిత్రానికి పెట్టిన పేరునుద్దేశిస్తూ ఆమె అంది. "నా బ్రతుకు నిజంగా తాదులేని బొంగరమే కావచ్చు.. నేను ఎందుకూ పనికిరాని గరికపూవునే కావచ్చు... అందుకని నన్ను నలుగురిలో నవ్వులపాలు చెయ్యాలని ఎక్కడా లేదే?! గుండెల్లోంచి ఉబికివస్తున్న దుఃఖాన్ని ఇక ఆపుకోలేక భోరుమని ఏడ్చేసింది. మనసు తేలిక పడేంతవరకూ ఏడ్చేసింది. ఆమె మనసు నిమ్మళించాక అతను క్షమాపణలు చెబుతూ అతనిపై చర్య తీసుకుంటానని ఆమెకు నచ్చచెప్పాడు. ఆమె వెళ్ళిన తరువాత ఇంటర్‌కమ్‌లో పి.ఎ వత్సలను రమ్మని పిలిచాడు... చార్జ్ మెమో డిక్టేట్ చేసే నిమిత్తం!

* * *

కబురంపగానే కంగారుగా వచ్చాడు చెమటనిండిన మొహంతో. వచ్చి నిలబడిన 'ప్రవీణ్'ను కూర్చోమని సైగచేస్తూ అన్నాడతను. "ఏం.. నాయనా నన్ను ప్రశాంతంగా ఉద్యోగం చేసుకోనివ్వవా?..." అతని మాటలో మందలింపు కనిపించింది.

"తప్పని తెలిసి కూడా తప్పుచేయడం.. తప్పుకదూ!? అయినా తప్పు చేస్తున్న మనిషికి తప్పును కప్పిపుచ్చుకునే తెలివితేటలు లేకపోతే ఎలా?... మరీ అంత నిజాయితీ అయితే ఎలాగయ్యా? ఆమె బుగ్గమీదున్న పుట్టుమచ్చను సైతం ఫోటో తీసినట్లు వేసేస్తే.. ఆమె కరవక.. మెచ్చుకుంటుందా?..మొత్తానికి గొప్ప సమస్య తీసుకొచ్చావ్!...."గాఢంగా నిట్టూర్చి టేబుల్ గ్లాస్‌మీద పేపర్‌వెయిట్‌ను గుండ్రంగా తిప్పుతూ ఆలోచనలో పడిపోయాడు. ఎదురైన సమస్యను ఎలా పరిష్కరించాలో అతనికా క్షణం తోచలేదులా వుంది.

ప్రవీణ్ అయోమయంగా అతనివైపు చూసి తడారిన గొంతుతో అన్నాడు. "సారీ సర్.. ఆమె ఇంతగా రియాక్టవుతుందనుకోలేదు...."

స్వేదబిందువులు లలాటమునుండి చెంపలమీదుగా కారుతున్నా తుడిచే ప్రయత్నంలో లేడు. అతని మనసెందుకో ఆందోళనకు గురైంది.

ప్రవీణ్ వాలకం చూసి అతను చిన్నగా నవ్వి "కంగారుపడకు... ఇందులో నాకూ భాగముంది..." అని మధ్యలో ఆగి కొంత తడవ తీవ్రంగా ఆలోచించి చటుక్కున ఏదో స్ఫురించడంతో తిరిగి అన్నాడు. "సరే!... అయిందేదో అయిపోయింది. మన గొడవలో పడి ఆమెను లేనిపోని గొడవకు గురిచేయడం తప్పే! ఓ పనిచేద్దాం!... కొంచెం డ్రెమటైజ్ చేసి సీన్ సబైడ్ చేయాలంటే

ఓ మార్గముంది. రేపు రాగానే నీకో చార్జ్ మెమో ఇష్యూ చేస్తాను.'' ప్రవీణ్ ఛార్జ్ మెమో అవగానే గతుక్కుమని చూడటంతో నవ్వి ఇంకా ఇలా అన్నాడు. ''కంగారుపడకు... ఇది కేవలం ఆమె తృప్తికోసం! చేతనైతే దిగాలు మొగం పెట్టుకుని కూర్చో! నీకు ఖాళీ దొరికినపుడు ధయిర్యం చిక్కితే ఆమెను కన్విన్స్ చేయడానికి ప్రయత్నించు.. మిగతా విషయాలు నేను చూసుకుంటాను...'' సరేనా అన్నట్లు ప్రవీణ్ వదనంలోకి చూశాడు.

ప్రవీణ్ మొహం మతాబులా వెలిగిపోయింది. తనకేదో ఉపద్రవం ముంచుకొస్తుందని భయపడిన తనకు.. అతను పూర్తిగా వత్తాసు పలకడంతో ఏనుగెక్కినంత సంబరం కలిగింది.

* * *

లంచ్ సమయంలో శ్వేత పక్కనే కూర్చుని తింటూ కబుర్లు చెబుతున్న 'వత్సల' అవనే అంది.

''అనవసరంగా అతనికి చార్జిషీట్ ఇప్పిస్తున్నావ్ పాపం!... అసలే మన ఎం.డి. చండశాసనుడు. నీకు తెలుసుగా! ఈ విషయం తెలిస్తే అతన్ని ఉద్యోగంలోంచి తీసినా తీసెయ్యగలడు. అయినా నీకెందుకంత కోపం రావాలి? అతను ఆర్టిస్ట్ కాబట్టి నీలో మరుగున దాగిన అందాన్ని వెలికిదీసి చూపించాడు... నిజంగా నీ బొమ్మ ఎంతందంగా వేశాడని?... ఈ అదృష్టం ఎంతమంది కొస్తుందే? పూర్వం అంతఃపురరాణులకు మాత్రమే ఈ భాగ్యం కలిగేదట!..మళ్ళీ ఇప్పుడు నీకు దక్కింది. నిజంగా నువ్వెంత అదృష్టవంతురాలివే?...'' ఆశువుగా చెప్పుకుపోతోంది.

''అదృష్టం!...'' పేలవంగా తనలో తనే నవ్వుకుంది శ్వేత. తనదీ ఒక అదృష్టమేనా! నిర్వేదన నిండిన కళ్ళతో చూసింది స్నేహితురాలివైపు.

ఆమెకు అభిముఖంగా ఆమడదూరంలో

## దొరల దొంగతనం



పట్టుబడనంతవరకు దొర. పట్టుబడితే దొంగ అనే సామెతను రుజువుచేసే సంగతన ఈ మధ్యనే లండన్‌లో జరిగింది. బ్రిటన్‌లో ఇండియన్ హైకమిషనర్‌గా చేసి రిటైర్ అయిన ప్రకాశ్ మెహ్రోత్రా వైద్యంకోసం సతీసమేతంగా లండన్ వెళ్ళారు. ఆయన ఆసుపత్రిలో ఉండగా ఆయన భార్య ప్రీతి షాపింగ్‌కు వెళ్ళి డబ్బు చెల్లించకుండా కొన్ని వస్తువుల్ని స్వంతం చేసుకుందట. దానిని గమనించిన షాపు యజమాని పోలీస్ రిపోర్ట్ చేశాడట. దాంతో లండన్ మేజిస్ట్రేట్ కోర్టు ఆమెను అరెస్టు చేయమని ఆదేశాలు జారీ చేసిందట! అయినా ఇలాటి దొంగతనం మాజీలు హైకమిషనర్‌గారి భార్యే చెయ్యాలా మన పరువు తీయటానికి కాకపోతే!

జూపిటర్

దిగాలుగా కూర్చున్న అతను బొమ్మలుగీసే ప్రయత్నంలో ఉన్నాడు. మనసు కలత చెందిన మూలాన బొమ్మ సంతృప్తిగా రాకపోవడంతో విసుగుతో కాగితం ఉండచుట్టి చెత్తబుట్టలోకి గిరాటేస్తున్నాడు. అనవసరంగా ఆమెను నొప్పించానన్న భావన అతన్ని తెలియని బాధకు గురిచేసింది.

క్యారేజీ శుభ్రపరుచుకోడానికని వత్సల వాష్‌బేసిన్ వైపు వెళ్ళడం చూసి అతను లేచి మెల్లగా ఆమెను సమీపించాడు.

ఆమె కంగారుగా తలెత్తి చూసి అతనని తెలియగానే తిరిగి నిర్లక్ష్యంగా తలదించుకుంది... అతనెందుకొచ్చిందీ ఆమె ఊహించకలదు కాబట్టి.

అతను ప్రక్కవాళ్ళకు వినబడనంతగా మెల్లగామంద్రస్థాయిలో అన్నాడు.''మీ అనుమతి లేకుండా మీ బొమ్మగీసి మీ మనసు నొప్పించాను... మీలో కదలిక రావాలనే సదుద్దేశంతోనే ఈ పనిచేశాను.

ఇంతకన్నా ఎక్కువచెప్పినా మీరు అర్థం చేసుకునేస్థితిలో లేరని తెలుసు... ఆయామ్ ఎక్స్ట్రీమ్లీసారీ!...' ఆమెనుండి సమాధానం కోసం ఎదురుచూడకుండా తనలో తను పరితపిస్తూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. ఆమె విస్తుబోయి అలాగే అతను వెళ్తున్నవైపే చూస్తుండిపోయాడు.

* * *

రాత్రంతా కూర్చుని ఆలోచించిన నిర్ణయాన్ని ఈ రోజు అమలుపరచాలనుకుంది. అందుకే ఆఫీసుకు రాగానే చేసిన మొట్టమొదటి పని అదే! నిన్న తనిచ్చిన ఫిర్యాదు పత్రాన్ని వెనక్కు తీసుకుంది. ఆమె అంతకుమించి మరోపని కూడా చేసింది. చాలాకాలం తరువాత నీటుగా ముస్తాబై వచ్చింది.

ఆమెలోవచ్చిన మార్పుకు ప్రవీణ్ కళ్ళు కాంతిపుంజాలయ్యాయి. ఆమె రూపం తన బొమ్మకు ప్రేరణైతే తను గీసిన బొమ్మ ఆమెకు ప్రేరేపణా?!

బీటలువారిన నేల వాన చిమకులకు తడిసి చిత్తడిగా మారినట్లు, మోడు వారిన కొమ్మచిగిర్చి మొగ్గదొడిగినట్లు రోజురోజుకూ ఆమెలో మార్పుకొట్టొచ్చినట్లు కన్పిస్తుంటే ఆఫీసులో సహోద్యోగులంతా ఆప్రతిభులయ్యారు. ఎప్పుడూ ముభావంగా మూగదేవతలా కనిపించే ఆమె అందరితోకలుపుగోలుగా కబుర్లు చెబుతోంటే తమ కళ్ళను తామే విశ్వసించలేని విచిత్రావస్థకు లోనయ్యారు.

అనుకోని విధంగా అతనితో ఆమెకు పరిచయం పెరిగి వటవృక్షంగా మారి అందరిలో ఎలాంటి బిడియం లేకుండా అతనితో సర్దాగా కబుర్లు చెప్పుకునేంత దగ్గరకు తీసుకువెళ్ళింది. ఈ సంతోషంలో తన వెనుక కథలల్లే కథకులున్నారన్న సంగతే పూర్తిగా మర్చిపోయింది. సుఖం తనకు వరమై కష్టాలు పరుల పరమవాలని కోరుకునే స్వార్థపరులను చూసి ఏవగించుకునే స్థితికొచ్చింది. బహుశా అతని చతుర సంభాషణే ఆమెనంతగా ప్రభావితం చేసి ఉండాలి!

కబుర్లు చెప్పుకుంటూ బస్‌స్టాండ్ చేరుకున్నారిద్దరూ.

ఉన్నట్టుండి ప్రవీణ్ అడిగాడు. " మనం సర్దాగా కాఫీ త్రాగి చాలా రోజులైందనుకుంటా?..."

అతని మాటకామె బదులివ్వలేదు. వ స్తున్న నవ్వునాపుకుంటూ ముందుకు కదిలింది.

"అరె?!... అటెక్కడికి?..." భృకుటి ముడివేస్తూ అడిగాడు.

కొంతదూరం వెళ్ళాక ఆమె వెనక్కు తిరిగి చూస్తూ అంది "కాఫీకి!... మా ఇంట్లో కాఫీ నీకు నచ్చదుగా..హోటలు వాడికి డబ్బులు పోస్తేనేకానీ... కొంతమందికి తృప్తి కలుగదు... నేనూ ఆ కోవకు చెందినదాన్నేననుక్కో!..." ఆమె కబుర్లు చెబుతూ నడుస్తుంటే ఆమె మొహంలోని హావభావ ప్రకటనలను వీక్షిస్తూ వివిధ రేఖల మిశ్రమంతో భావ సంఘ ర్షణలను ఏవిధంగా చిత్రించవచ్చో నేర్చుకుంటున్నాడు.

'తాజ్'లో ఒకరినొకరు ఎదురెదురుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాఫీ త్రాగుతున్నారు.

అతను ఆఖరి గుక్కమింగి ఖాళీ కప్పు బల్ల మీదుంచుతూ అడిగాడు. అతని ప్రశ్న అర్థం గాక చకితురాలై చూసింది.

అతను మళ్ళీ రెట్టించాడు. "ఈ నేతివ్రేళ్ళలో బొటనవేలెంత ముఖ్యమైంది కదా అని అడుగుతున్నాను?"

ఆమెకు ఈసారి కూడా బోధపడ్లేదు.


"చెయ్యి లేకుండా మనిషి బ్రతకలేడా?"

"దేని గురించి నీ ప్రయత్నం?..." విసుగు నటిస్తూ అడిగింది.

అతను దన ధోరణిలోనే సాగిపోతూ అన్నాడు. "కాళ్ళులేని మనిషికి జీవితమంతా నరకప్రాయమే కదా?!"

ఆమె చివరివరకూ ప్రయత్నించింది అతను చర్చించే విషయానికి మూలవ స్తువేమిటని.. తనే నన్న విషయం తెలియక!

చివరకతనే అన్నాడు "నేను చూశాను..



నా చిన్నతనంలో ఓ ప్రదర్శనశాలలో చూశానో మనిషిని. అతనికి రెండు చేతులూ లేవు కాని చిత్రమేమిటంటే అతను సులువుగా సూదిబెజ్జం లోకి దారం దూర్చగలడు... అతి సునాయాసంగా అన్ని పనులూ చేసుకోగలడు. మధ్యలో ఆగి ఆమె వైపు నిశితంగా చూస్తూ తిరిగి అన్నాడు. ''కానీ... అన్ని అవయవాలు ఉన్న మనం... లేని అవిటి తనాన్ని సృష్టించుకుని కుమిలి కుమిలి ఏడుస్తాం!... మనసు గాయపరచి ఏడ్పించే బుద్ధి ఎదుటి వారిదైతే.. చేతకాని మనిషిలా ఏడ్చే హక్కు మనది!

ఆమె నిశ్చేష్టురాలయి అతనివైపే చూస్తూ కూర్చుంది. అతని భావ సంఘర్షణేమిటో ఇప్పటికర్థం చేసుకో గలిగింది. అయినా ఈ సమాజాన్ని ఎదిరించి నిలబడగల ధయిర్య సాహసాలు నిజంగా తనకున్నాయా? మానసిక సంఘర్షణకు లోనయి తనలో తనే అనుకుంది. ఎందుకూ పనికిరాని తనలాంటి గరికపూవును అర్చనకు ఉపయోగపడేలా చేయాలని ఈ మనిషి కెందుకింత తాపత్రయం?

* * *

ఈ రోజెందుకో ఆమె మనసు అలవిగాని అలజడికి లోనైంది...అల్లకల్లోలమైన సముద్రగర్భంలోంచి అమృతకలశం ఉద్భవించినట్లు ఒక స్థిరనిర్ణయానికిప్పటికి రాగలిగింది. గట్టు తెగిన ఏరులా సంతోషం పొంగిపొర్లింది.

కళ్ళు మూసినా — కళ్ళు తెరిచినా అదే రూపం, అవే మాటలు. చెవులనుండి మనసును తాకి మైమరపును కలిగిస్తున్నాయి.

ఎంతకూ నిద్రపట్టక మంచంమీంచి లేచికూర్చుంది. నెమ్మదిగా లేచి వెళ్ళి శబ్దంకానంత మెల్లగా తలుపు మూసి గెడవేసింది. లైటువేసి బీరువాకున్న నిలువుటద్దంలో తన ప్రతిబింబం తనివితీరా చూసుకుంది. చిన్నగా బీరువా తలుపు తెరిచి బట్టలన్నీ ఆత్రంగా వెతికింది. రహస్యంగా దాచుకున్న కుంకుమ భరిణ, కాటుక డబ్బా బయటకు తీసింది. తన పెళ్ళినాటి పట్టుచీర మడత విప్పి కట్టుకుంది. అత్తవారిచ్చిన నగలు నిండుగా అలంకరించుకుంది. కళ్ళకు కాటుక దిద్దుకుంది. నుదుట తిలకం పెట్టుకుంది.

మళ్ళీ పెళ్ళికూతుర్లా ముస్తాబయింది. అతని మాట ఈసారి అక్షరాలా నిజమనిపించింది. నుదుటదిద్దిన కుంకుమ తిలకం సరిదిద్దుకుంటూ మనసులో అనుకుంది. పెళ్ళికి ముందున్న నుదుటిబొట్టును... తెగిన మాంగల్యంతో ముడేసి ఉరేయడం ఎంత అర్థరహితమని?!

అతను బ్రతుకుబాటలో తనకన్నా హాలుగేళ్ళు వెనుకబడి ఉన్నా... అతని విప్లవ భావాలు తన మనసును తట్టిలేపి స్పందింపచేసి వెనక్కి తిరిగి చూసేలా చేశాయి!

ఈ క్షణంలో అతనే గనుక తన కళ్ళెదురుగా ఉంటే.. రెండు చేతులతో ఆప్యాయంగా అతని శిరస్సును దగ్గరకు తీసుకుని అతన్ని తనివితీరా ముద్దులతో ముంచెత్తి తన ఆనందాన్నలా వ్యక్తపరిచి ఉండేదేమో!!??